ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 24.0 ; కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 20 ఆగస్టు 2025



నాకు ఇల్లు ఇవ్వలేదు.. ఏం ఇవ్వలేదు.. ఇక చెప్పింది చాలు
● 'పేట' ఎమ్మెల్యే ప్రసంగం మధ్యలో గొడవ చేసిన మహిళ
6


పట్టుబడిన బైకు దొంగ
● జడ్చర్ల బస్టాండ్ క్యాంటీన్ వద్ద నిలిపి ఉన్న వాహనం తీసుకెళ్లేందుకు యత్నం
● గమనించి పట్టుకున్న సెక్యూరిటీ గార్డు
7

డెడ్‌లైన్ సెప్టెంబరు 15

● శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో నాలుగో యూనిట్ రన్ చేయడానికి ఏర్పాట్లు
● పూర్తి కావొస్తున్న స్టార్టర్ వైండింగ్, 27న రోటర్ దించనున్న అధికారులు
● అన్నీ అనుకున్నట్లు జరిగాక మరోసారి హై ఓల్టేజీ టెస్టు, తర్వాత ఉత్పత్తి
● ఎడమ జల విద్యుత్ కేంద్రంలో ప్రమాదం జరిగి నేటికి ఐదేళ్లు
● బాధిత కుటుంబాలకు పరిహారం, ఇంటికొకరు ఉద్యోగాల్లో నియామకం



ప్రమాద సమయంలో జల విద్యుత్ కేంద్రంలో ఎగసి పడుతున్న మంటలు(ఫైల్)



శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న నాలుగో యూనిట్ మరమ్మతు పనులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునే ఒత్తిడిలో బ్యాటరీలను మారుస్తుండగా శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో మంటలు చెలరేగి తొమ్మిది మంది సజీవ దహనమైన దుర్ఘటనకు నేటికి ఐదేళ్లు పూర్తవుతోంది. 2020 ఆగస్టు 20వ తేదీన ఈ దుర్ఘటన జరగ్గా జెన్‌కో ఉద్యోగులు ఏడుగురు, ప్రైవేటు కంపెనీకి చెందిన ఉద్యోగులు ఇద్దరు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో నాలుగో యూనిట్ పూర్తిగా కాలిపోగా సుమారు రూ. 100 కోట్ల మేర ఆస్తినష్టం జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఐదేళ్లుగా నాలుగో యూనిట్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జెన్‌కో కష్టపడుతున్నప్పటికీ ఇంకా పనులు పూర్తికాలేదు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి సీజన్ కొనసాగుతుండగా సెప్టెంబరు 15 వరకు పనులు పూర్తిచేసి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నారు. ఇప్పటికే స్టేటర్ వైండింగ్ పనులు పూర్తి కావొస్తుండగా బార్ గ్రేసింగ్, ఎండ్ క్యాప్స్ ఫిల్లింగ్ పనులు ముమ్మరంగా నడుస్తున్నాయి. ఆగస్టు 27వ తేదీన స్టేటర్ పనులు పూర్తిచేసి రోటర్‌ను దించడానికి నిర్ణయించారు. ఆ తర్వాత అప్పర్ బ్రాకెట్స్, ప్లేట్స్ బిగించి మరోసారి హెచ్‌వీ (హై ఓల్టేజీ) టెస్టును పూర్తిచేయనున్నారు. ఆ తర్వాత విద్యుదుత్పత్తికి మార్గం క్లియర్ అవుతుందని అంచనాలు వేస్తున్నారు. జూలై 14వ తేదీ నాటికే నాలుగో యూనిట్‌లో మరమ్మతులు పూర్తిచేసి

(మిగతా 6లో..)

దుర్ఘటన తీరు ఇది

శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రం పూర్తి అండర్‌గ్రౌండ్‌లో ఉంటుంది. జపాన్ సాంకేతికతతో నిర్మించిన ఈ హైడల్ పవర్ ప్రాజెక్టులో ఆరు యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌లో 150 మెగా వాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. ఇందులో ఉత్పత్తి ప్రారంభించిన 20 సంవత్సరాలపాటు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తలేదు. 2020 ఆగస్టు 20వ తేదీన విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునే క్రమంలో బ్యాటరీలపై ఒత్తిడి ఎక్కువైంది. ఈ క్రమంలో నాలుగో యూనిట్‌లో బ్యాటరీలు మారుస్తుండగా షార్ట్ సర్క్యూట్ అయ్యింది. ఉవ్వెత్తున ఎగిసి పడిన మంటల్లో నాలుగో యూనిట్ పూర్తిగా కాలిపోగా ఐదుగురు ఇంజనీర్లు, ఇద్దరు ప్లాంట్ అసిస్టెంట్లు, ఇద్దరు అమర్‌రాజా బ్యాటరీ కంపెనీ ఉద్యోగులు సజీవ దహనమయ్యారు. ప్లాంటును రక్షించాలని కష్టపడుతుండగా మంటలకు ఆహుతయ్యారు. ఈ దుర్ఘటనకు ఇద్దరు సీఈలను బాధ్యులుగా చేసి, వారి నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని విచారణలో గుర్తించిన తర్వాత వారిని ఎస్ఈలుగా డిమోట్ చేశారు. అయితే తర్వాత వారు మళ్లీ అడ్డదారుల్లో ప్రమోషన్ల కోసం ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. 9 మంది మృతికి కారణమైన వారిని నామమాత్రపు చర్యలతో వదిలేశారనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలా ఉంటే మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున జెన్‌కో పరిహారం అందించగా వారందరి కుటుంబ సభ్యుల్లో ఒక్కొక్కరి చొప్పున ఉద్యోగాలు కూడా ఇచ్చారు. ఈ దుర్గటనలో దాదాపు రూ. 100 కోట్ల మేర ఆస్తినష్టం జరిగింది.



కరిగెట్లోకి దిగిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



కూలీలతో కలిసి నాట్లు వేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నాట్లేసిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి వరి నాట్లు వేశారు. నారాయణపేట మండలం చిన్నజట్రం సమీపంలో కూలీలు నాట్లు వేస్తుండగా అటువైపు వెళ్తున్న ఎమ్మెల్యే వారి వద్దకు వెళ్లి పలుకరించారు. తర్వాత కరిగెట్లోకి దిగి, కూలీలతో కలిసి నాట్లు వేశారు. కూలీలు ఎమ్మెల్యేకు ఇలా నాటు వేయాలని చూపించారు. తమతో కలిసి ఎమ్మెల్యే నాట్లు వేయడంతో కూలీలు ఆనందం వ్యక్తం చేశారు.

కొత్త కార్డులకూ రేషన్

● సెప్టెంబరు నుంచి పంపిణీ
● 'పేట' జిల్లాలో కొత్తగా 21,339 రేషన్ కార్డుల జారీ
● 1,00,234 మందికి లబ్ధి



నారాయణపేటలోని ఓ రేషన్ దుకాణం

నారాయణపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి సరుకులు అందనున్నాయి. సెప్టెంబరు బియ్యం పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. జూన్‌లో మూడు నెలల రేషన్ సన్న బియ్యాన్ని ప్రభుత్వం అందించింది. సెప్టెంబరు కోటా అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 301 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జనవరిలో రేషన్ కార్డులు 1, 40,320 ఉండగా, 5,08,354 మంది లబ్ధిదారులకు 32,174.23 క్వింటాళ్ల రేషన్ బియ్యం కేటాయించారు. కొత్త కార్డులు ఇవ్వడంతో కార్డులు



1,61,719కి పెరిగాయి. బియ్యం కోటా 38,081.78 క్వింటాళ్లకు పెరిగింది. కొత్త కార్డులు 21,339 ఇవ్వగా, అదనంగా 1,00,234 మందికి లబ్ధి చేకూరనుంది. వారికి 5, 907.55 క్వింటాళ్ల బియ్యం అందించనున్నారు. మొత్తంగా 61,719 రేషన్‌కార్డులకు సంబంధించి 6,08, 588 లబ్ధిదారులకు 38,081.78 క్వింటాళ్ల రేషన్ బియ్యం అందనుంది. కొత్త కార్డులు రావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాధాన్య రంగాలకు అధిక రుణాలివ్వాలి

● డీసీసీ సమావేశంలో 'పేట' కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట , ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్య రంగాలైన అగ్రికల్చర్, ఎంఎస్ఎంఈ అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎన్ఆర్ఎల్ఎం, పీఎం ఈజీపీ పథకాల కింద త్వరితగతిన అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన డీసీసీ(డిస్ట్రిక్ట్ కన్సల్‌టేటివ్ కమిటీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ బ్యాంకర్లు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి, రుణాలు సకాలంలో మంజూరు చేయాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ 2025-26 వార్షిక ప్రణాళిక జూన్ 25తో ముగిసిందన్నారు. తొలి ఆర్థిక త్రైమాసికం సంవత్సరానికి సంబంధించి, రూ.4,204.49 కోట్ల బడ్జెట్‌కు గాను రూ.809.25 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. ఎంఎస్ఎంఈ సెగ్మెంట్‌కు సంబంధించి రూ.310.30 కోట్ల బడ్జెట్‌కు రూ.90.03 కోట్ల వ్యవసాయేతర రుణాలు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. మొత్తం ప్రాధాన్యత రంగానికి రూ.3,833.48 కోట్ల బడ్జెట్ కేటాయించగా రూ.623.96 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇది వార్షిక బడ్జెట్‌లో 16.28 శాతంగా నమోదైనట్లు ఆయన వివరించారు. ఆర్‌బీఐ ఏజీఎం గోమతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రమాద, వ్యక్తిగత బీమా పథకాల గురించి వివరించారు. సమావేశంలో నాబార్డు డీడీఎం షణ్ముఖచారి, ఎస్‌బీఐ సీఎం జఫ్ఫార్ మొయినుద్దీన్, టీజీబీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, యూబీఐ ఏజీఎం మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి
● వర్షాలు, సహాయక చర్యలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. కలెక్టరేట్ వీసీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వెబెక్స్ ద్వారా వర్షాలు, సహాయక చర్యలు, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రాధాన్య కార్యక్రమాలపై ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, ఎంపీవోలు, ఏపీఓలతో కలెక్టర్ మంగళవారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అధికారుల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రహదారులు దెబ్బతింటే వెంటనే మరమ్మతులు చేట్టాలన్నారు. చెరువులు, వాగులు నిండి రోడ్లపై అలుగు పారితే ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేట్టాలని చెప్పారు. వర్షాల కారణంగా సీజనల్ రోగాలు వ్యాప్తి చేందకుండా పారిశుధ్య పనులు చేట్టాలని మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్ష చేస్తూ ఇప్పటికి వరకు మొదలు పెట్టని ఇళ నిర్మాణాలను ఈ నెల 24 వరకు చేపట్టాలన్నారు. దశలా వారీగా బిల్లులు చెల్లించాలని గృహ నిర్మాణ శాఖ పీడీకి చెప్పారు. సమావేశంలో సమమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో నరసింహులు, డీపీవో పార్థసారథి, గృహ నిర్మాణ శాఖ పీడీ వైద్యం బాస్కర్ పాల్గొన్నారు.



రాస్కోర సాంబ!

నారాయణపేట మండలం సింగారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఓ శునకం శిలాఫలకాన్ని ఇలా తదేకంగా చూస్తూ కనిపించింది. దానిపై ఉన్న అక్షరాలను చదువుతున్నట్లు కొద్దిసేపు అలానే ఉన్నది. అక్కడ ఉన్నది చదివి పక్కన ఉన్న మరో శునకానికి చెప్తున్నట్లు కనిపించింది. అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి డీకే సమరసింహారెడ్డి హయాంలో ఈ భవనాన్ని నిర్మించినట్లు శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ముసురు వర్షం కారణంగా పంచాయతీ భవనం ఆవరణలోకి వచ్చిన శునకం ఇలా శిలాఫలకాన్ని చూడటం చూసి పలువురు ఆశ్చర్యపోయారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ఈ దృశ్యాన్ని క్లిక్ మనిపించింది.

- నారాయణపేట, (ఆంధ్రజ్యోతి)



అలుగు పారుతున్న నారాయణపేట మండలం కోటకొండ చెరువు

ఏకధాటి వర్షం

● 48 గంటల నుంచి వదలని వాన
● ఉమ్మడి పాలమూరులో స్తంభించిన జన జీవనం
● పలు పాఠశాలలకు మధ్యాహ్నం నుంచి సెలవు
● అలుగు పారుతున్న వాగులు, వంకలు
● గ్రామీణ ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు
● నవాబ్‌పేట మండలం కారూర్‌లో కూలిపోయిన చెక్‌డ్యాం
7

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

● మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి
● జడ్చర్ల వద్ద యూరియా స్టాక్ పాయింట్ తనిఖీ
● ధరలపై ఆరా



స్టాక్ పాయింట్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

జడ్చర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జడ్చర్లలోని యూరియా స్టాక్ పాయింట్‌ను ఎస్పీ జానకి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్‌తో కలిసి స్టాక్ పాయింట్‌లో ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా విక్రయాలు జరుగుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. తనిఖీల్లో జడ్చర్ల మండల వ్యవసాయశాఖ అధికారి గోపీనాథ్, జడ్చర్ల సీఐ కమలాకర్, స్పెషల్‌బ్రాంచ్ ఎస్ఐ శ్రీనివాస్, జడ్చర్ల ఎస్ఐ జయప్రసాద్ పాల్గొన్నారు.

రహదారి పరిశీలన

జడ్చర్ల మండలంలోని నసరుల్లాబాద్ చెరువు నిండి అలుగు పారడంతో నీళ్లన్నీ చర్లపల్లి-నసరుల్లాబాద్ ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్నాయి. ఆ రహదారిని ఎస్పీ జానకి పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీరు పారుతున్న సందర్భంలో ఆ రహదారి గుండా రాకపోకలు సాగించొద్దని చెప్పారు.

గంజాయి విక్రేతల అరెస్టు

● గద్వాలలో 1.6 కిలోలు, మక్తల్‌లో 150 గ్రాముల సరకు స్వాధీనం
● ఒక్కో చోట ముగ్గురి చొప్పున ఆరుగురు అదుపులోకి..
7

టీఎల్ఎం మేళాతో నైపుణ్యాల పెంపు

● డీఈవో ప్రవీణ్ కుమార్
● అన్ని మండలాల్లో నిర్వహిస్తామని వెల్లడి



మేళాను పరిశీలిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

భూత్పూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నూతనోత్తేజం, నైపుణ్యాలను పెంపొందించడానికి టీఎల్ఎం(టీచర్స్ లర్నింగ్ మెటీరియల్) మేళా ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం భూత్పూర్ మండల కేంద్రంలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మేళాను డీఈవో మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఎంపీడీవో ప్రభాకర్‌చారి, మండల విద్యాశాఖ అధికారి ఉషారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన టీచర్స్ లర్నింగ్ మేటీరియల్స్‌ను డీఈవో పరిశీలించారు. మేళాలను మండల స్థాయిల్లో నిర్వహించి, ప్రతిభ చూపిన వారిని జిల్లాకు ఎంపిక చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి రాష్ట్ర స్థాయిల్లో మేళాలో నైపుణ్యాన్ని ప్రదర్శించుకునే అవకాశం కల్పిస్తామన్నారు.

నాకు ఇల్లు ఇవ్వలేదు... ఏం ఇవ్వలేదు.. ఇక చెప్పింది చాలు

» నారాయణపేట ఎమ్మెల్యే ప్రసంగం మధ్యలో గొడవ చేసిన మహిళ

ధన్వాడ, ఆగస్టు 19 : (ఆంధ్రజ్యోతి) : నాకు ఇల్లు ఇవ్వలేదు... ఏం ఇవ్వలేదు... పింఛన్ డబ్బులు పెంచుతమన్నరు... ఫ్రీ బస్సు ఎవరికి అవసరం.. ముందుగా నాకు ఇల్లు ఇవ్వాలంటూ నారాయణపేట జిల్లా ధన్వాడలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రసంగం మధ్యలో ఓ మహిళ గొడవ చేశారు. ధన్వాడలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో చేనేత సంక్షేమ పథకాలపై మంగళవారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చేనేత పథకాలపై మాట్లాడుతున్న సమయంలో మణెమ్మ అనే మహిళ మధ్యలో లేచి ఫ్రీ బస్సు ఎవరు అడిగిన్రు... పెంచుతామన్న పింఛన్ డబ్బులు ఎందుకు ఇవ్వలేదు.... నాకు జాగ ఉంది ఇల్లు ఇస్తామని చెప్పి ఇల్లు ఎందుకు ఇవ్వలేదు అని సమావేశంలో కొద్ది సేపు గొడవ చేశారు. ఎమ్మెల్యేతో పాటు అక్కనే ఉన్న పార్టీ నాయకులు కొందరు ఆ మహిళను శాంతింపజేయడానికి ప్రయత్నించినప్పటికీ ఆమె వినకుండా ఏం ఇచ్చారు... ఏం మాట్లాడతారు అంటూ గట్టిగానే లీడర్లతో వాగ్వివాదానికి దిగారు. పోలీసుల జోక్యంతో లొల్లి చేసిన మహిళను సమావేశం నుంచి బయటకు పంపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుడూ చేనేత అభివృద్ధికి తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరహరి, తహసీల్దార్ సింధూజ, పద్మాశాలి సంఘం కార్యవర్గ సభ్యులు బోర్ల శివాజీ, గోపికృష్ణ, కెంచె జయప్రకాష్‌తో పాటుగా పలువురు పాల్గొన్నారు.

చీరపైన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చిత్రపటం

» అభిమానం చాటుకున్న చేనేత కార్మికుడు గోపీకృష్ణ



చీరపైన వేసిన చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు బహూకరిస్తున్న గోపీకృష్ణ

ధన్వాడ, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ధన్వాడ మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు గోపీకృష్ణ ఎమ్మెల్యే పర్ణికారెడ్డిపై తన అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే చిత్రపటాన్ని చీరపై నేసి, ఫ్రేమ్ చేయించి మంగళవారం ఆమెకు బహూకరించారు. ఈ సందర్భంగా చీరపై తన చిత్రపటం ఎంతో బాగుందని ఆమె గోపీకృష్ణను అభినందించారు. అక్కడున్న వారందరికీ చూపించి సంతోషపడ్డారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీయూ రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబు

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణలతో కలిసి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 803 మందికి గాను, 781 మంది విద్యార్థులు హాజరయ్యారని పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో తొమ్మిది యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఎగువ కేంద్రం లోని ఆరు యూనిట్ల ద్వారా 3.556 మిలియన్ యూనిట్లు, మొత్తం ఇప్పటి వరకు 254.762 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. దిగువ కేంద్రంలో మూడు యూనిట్ల ద్వారా 3.228 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యింది. ఇప్పటి వరకు 224.990 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

చిరుత దాడిలో వ్యక్తికి గాయాలు



చిరుత దాడికి గురైన గత్ప నరేష్

గండీడ్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా, గండీడు మండల పరిధిలోని లింగాయపల్లి శివారులో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గత్ప నరేశ్ మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై రంగారెడ్డిపల్లికి వెళ్ళాడు. సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా చింతగుట్ట వద్ద చిరుతపులి అతడిపై దాడి చేసి పారిపోయింది. తీవ్రంగా గాయపడిన అతడు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ఈ సంఘటనతో లింగాయిపల్లి, జక్లపల్లి, సాలర్‌నగర్, రంగారెడ్డిపల్లి గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారు లు స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు.

పక్కాగా ఉపాధి

» పనులు, కూలీల గుర్తింపునకు కఠిన నిబంధనలు

» పనికి ముందు, తర్వాత ఫొటోల అప్‌లోడ్

» నూతన మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం

» వచ్చేనెల 15 నుంచి అమలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ గత నెల 8న సర్క్యులర్ జారీ చేసింది. పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో మార్పులు చేశారు. ప్రధానంగా కూలీల హాజరును రెండు సార్లు ఫొటోలతో నమోదు చేయడం తప్పనిసరి చేశారు. ఈ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) విధానంలో అమలు చేస్తోంది.

మల్టీ లెవల్ వెరిఫికేషన్

ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశానికి వెళ్లి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు.

పంచాయతీ కార్యదర్శులు ఫొటోల నాణ్యత, సరిపోలికలను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత మండల, జిల్లాస్థాయి అధికారులు కనీసం 20 శాతం ఫొటోలను మాన్యువల్‌గా పరిశీలించి నిర్ధారిస్తారు. దీంతో తప్పుడు ఫొటోలు, లేదా ఒకే ఫొటో మళ్లీమళ్లీ అప్‌లోడ్ చేస్తే సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది.

ఈకేవైసీతో ధ్రువీకరణ

'ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్' (ఈకేవైసీ) విధానంతో కూలీలను మరింత కచ్చితత్వంతో గుర్తించే అవకాశం కలుగుతుంది. కూలీల ఆధార్ వివరాలతో ఫొటోలను సరిపోల్చి, వ్యక్తిగత ధ్రువీకరణ చేస్తారు. రెండు ఫొటోలు సరిపోలకపోయినా, ఆధార్ నెంబర్ కలువకపోయినా వేతనాలను నిలిపివేసే అవకాశం ఉంటుంది.

మాన్యువల్ బ్యాకప్‌కు అనుమతి

గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్, ఇంటర్నెట్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అలాంటి సమయాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు మాన్యువల్ మస్టర్ రోల్స్ ద్వారా హాజరు నమోదు చేయొచ్చు. కానీ అందుకు పూర్తి డాక్యుమెంటేషన్ సాక్ష్యాలు, ఫొటోలు తప్పనిసరి. ఆ తరువాత సిగ్నల్ వచ్చినప్పుడు ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

తాజా నిబంధనలు ఇవే..!

కొత్త సర్క్యులర్ ప్రకారం ప్రతీ రోజు కూలీల గ్రూపు ఫొటోలను రెండు సార్లు తీసి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పని ప్రారంభ సమయంలో (ఉదయం 9 గంటలలోపు), మొదటి ఫొటో, పని ముగిసిన తరువాత (సాయంత్రం 4 గంటల తరువాత) రెండో ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో కూలీల హాజరు, పని సమయాన్ని కచ్చితంగా నమోదయ్యే అవకాశం కలుగుతోంది. దీంతో నకిలీ హాజరు లేదా తప్పుడు ఫొటోల అప్‌లోడ్‌కు అవకాశం ఉండదు.

శిక్షణ, అవగాహన అవసరం

ఎన్ఎంఎంఎస్ యాప్‌లో తీసుకొచ్చిన నూతన విధానాలు రెండు ఫోటోలు, ఈకేవైసీ మల్టీ లెవల్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియల ద్వారా పారదర్శకత పెరుగుతుంది. ఈ విధానం అక్రమాలను అరికట్టడంలో సహాయపడుతుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్, ఇంటర్నెట్ అంతరాయాలు ఏర్పడుతుంటాయి. అప్పుడు ఫోటోలు అప్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. కూలీలకు వేతనాలు ఆలస్యం కావచ్చు. రెండు ఫోటోలు, మల్టీ లెవెల్ తనిఖీల వల్ల పనిభారం పెరుగుతుందని ఫీల్డ్ అసిస్టెంట్లు అభిప్రాయపడుతున్నారు. అందుకోసం వారితో పాటు, కూలీలకు కూడా పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి, అవగాహన కల్పించాల్సి ఉంది.

యూరియా కోసం.. రోడ్డెక్కిన రైతులు

» అమరచింత ప్రధాన రహదారిపై రాస్తారోకో

» అయిజ సింగిల్‌విండో కార్యాలయం దిగ్బంధం



అమరచింతలో యూరియా కోసం కూర్చున్న రైతులు



వర్షానికి తడవలేక చెప్పులను క్యూలైన్ లో పెట్టిన రైతులు

ఆత్మకూరు/ అమరచింత/ అయిజ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సాగు పనుల్లో నిమగ్నమై ఉండాల్సిన రైతులు కావలసినంత యూరియా దొరకక అవస్థలు పడుతున్నారు. సింగిల్‌విండో కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. అయినా యూరియా దొరకకపోవడంతో ఆందోళన బాట పడుతున్నారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు సింగిల్‌విండో కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం నుంచే రైతులు పడిగాపులు గాశారు. అయినా యూరియా దొరకక పోవడంతో ఆగ్రహించారు. ఉదయం 11 గంటలకు అమరచింత ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పక్కనే ఉన్న రేచింతల సింగిల్‌విండో కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని, ఆత్మకూరులో ఎందుకు ఉండదంటూ అధికారులను ప్రశ్నించారు. ఒక రైతుకు ఒక్కటే బస్తా ఇవ్వడం వల్ల ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నరేందర్ అక్కడికి చేరుకొని సింగిల్‌విండో అధికారులను పిలిపించారు. దీంతో సీఈవో నరేశ్‌కుమార్ వచ్చి మాట్లాడారు. అందరికీ యూరియా బస్తాలు ఇస్తామని నచ్చచెప్పారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు 20 టన్నుల యూరియా అందుబాటులోకి రావడంతో రైతులకు పంపిణీ చేశారు.

తెల్లవారుజామున 5 గంటల నుంచే..

అలాగే అమరచింతలోని ఆగ్రో రైతు సేవ కేంద్రానికి మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి క్యూలో నిలుచున్నారు. వర్షంలో తడుస్తూనే యూరియా కోసం ఎదురు చూశారు. ఆగ్రో సేవాకేంద్రం నిర్వాహకులు ఒక పట్టా పుస్తకానికి రెండు బస్తాల చొప్పున రైతులకు యూరియా పంపిణీ చేశారు.

అయిజలో ఉద్రిక్త వాతావరణం

జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ సింగిల్ విండో కార్యాలయాన్ని మంగళవారం రైతులు దిగ్బంధించారు. సింగిల్‌విండో కార్యాలయానికి మంగళవారం ఉదయం మార్క్‌ఫెడ్ నుంచి 300 సంచుల యూరియా వచ్చింది. అప్పటికే యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు ఒక్క సారిగా ఎగబడ్డారు. కార్యాలయంలోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. దీనితో చైర్మన్ సీటు ఉన్న కిటికి దగ్గర వచ్చి నినాదాలు చేశారు. దీంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని, పరిస్థితిని చక్కదిద్దారు. రైతులందరినీ క్యూలో నిలిచోబెట్టి, యూరియా పంపిణీ చేయించారు. పొలం విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఒక్కో రైతుకు 2 యూరియా బస్తాలను అందజేశారు.

డెడ్‌లైన్ సెప్టెంబరు 15

(5వ పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకురావాలని భావించినప్పటికీ సాధ్యంకాలేదు. ఇప్పుడు తాజా గడువులోపు పనులు పూర్తవుతాయా అనేది తెలియాల్సి ఉంది. జెన్‌కో, కాంట్రాక్టు సంస్థ అయిన వాయిత్ ఏజెన్సీలకు చెందిన 25 మంది ఉద్యోగులు నిరంతరం పనులు చేస్తున్నారు. ఈ యూనిట్ ప్రారంభమైతే మరో 150 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అదనంగా జరగనుంది.

ఆది నుంచీ అవాంతరాలే...

ప్రమాదం జరిగిన తర్వాత నాలుగో యూనిట్ పునరుద్ధరణ కోసం ఢిల్లీకి చెందిన వాయిత్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారు. 2021 సెప్టెంబరులో పనులు ప్రారంభించగా 2023 జూలై చివరి నాటికి పూర్తిచేసి జెన్‌కోకు అప్పగించారు. 2023 జూలై 17న నాలుగో యూనిట్‌ను రన్ చేసి, గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 19 రోజుల్లో 70 గంటల వ్యవధిలో 11.60 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. 2023 ఆగస్టు 17న స్టార్టర్ వైండింగ్ బార్స్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో మరోసారి మంటలు చెలరేగాయి. యూనిట్ కాలిపోయి అప్పటి నుంచి పనిచేయడం లేదు. కాంట్రాక్టు కంపెనీ జెన్‌కో సంస్థ సక్రమంగా రన్ చేయకపోవడంతోనే మంటలు చెలరేగాయని తప్పించుకునే ప్రయత్నం చేయగా జెన్‌కో నిపుణుల కమిటీతో విచారణ చేయించింది. ఇందులో మరమ్మతుల్లో నాసిరకం మెటీరియల్ వాడటం వల్లే ప్రమాదం జరిగిందని తేలింది. దీంతో వాయిత్ కంపెనీ లైసెన్సును బ్లాక్ లిస్టులో పెట్టారు. తర్వాత మళ్లీ అదే కంపెనీకి పనులు అప్పగించింది. ప్రస్తుతం పనులు ముమ్మరంగా నడుస్తున్నాయి. స్టార్టర్ వైండింగ్ బార్లు 950 వరకు ఉండగా అందులో 150 కాలిపోగా వాటిని తొలగించింది కొత్తవి చైనా నుంచి తెప్పించి ప్రస్తుతం బార్ గ్రీసింగ్ చేస్తున్నారు. అయితే ఈసారి యూనిట్‌లోని స్టార్టర్ బార్లు, రోటర్‌లో ఏదైనా సాంకేతిక లోపం తలెత్తి ప్రమాదం జరిగే అవకాశం ఉంటే ముందే పసిగట్టేందుకు ప్రత్యేకమైన సెన్సార్లను బిగిస్తున్నారు. దీనివల్ల పనితీరును ప్యానెల్ మానిటర్‌లో గమనించి ప్రమాదం జరుగకుండా చూసుకునే వెసులుబాటు కలుగుతుందని ఇంజనీర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో అడుగుకో గుంత



పెంట్లవెల్లి బస్టాండ్‌లో నిలిచిన ఆర్టీసీ బస్సు

పెంట్లవెల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెంట్లవెల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ అడుగుకో గుంతతో అధ్వానంగా తయారయ్యింది. 28 సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ఈ బస్టాండ్‌ను నిర్మించారు. ఆ తర్వాత 10 సంవత్సరాల వరకు ఇక్కడి నుంచి బస్సుల రాకపోకలు కొనసాగాయి. ఆ తరువాత వివిధ కారణాలతో బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లడం లేదు. ఈ విషయంపై పెంట్లవెల్లి గ్రామానికి చెందిన మూలు మేఘరాజు అనే వ్యక్తి ఇటీవల నిరాహార దీక్ష చేపట్టారు. దీంతో ఆర్టీసీ అధికారులు స్పందించి నెల రోజుల క్రితం బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చారు. కానీ ఆవరణలో సీసీ లేకపోవడంతో గుంతమయంగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుంతల్లో నీరి నిండి అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రయాణికులు, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు బస్సు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో సిమెంట్ కాంక్రీట్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు

» ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సునీత భగవత్



సోమశిల లలితాంబిక సోమేశ్వరాలయాన్ని సందర్శించిన తెలంగాణ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సునీత భగవత్ , చిత్రంలో డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

కొల్లాపూర్ , ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేసన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సునీత భగవత్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలంలోని సోమశిలలో సోమవారం రాత్రి ఆమె బస చేశారు. మంగళవారం ఉదయం క్షేత్రంలోని లలితాంబికా సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డీఎఫ్‌వో రోహిత్ గోపిడిలతో కలిసి కృష్ణానదిలో స్పీడ్ బోట్‌లో అమరగిరి బలపాల తిప్పకు వెళ్లారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటకుల కోసం నిర్మిస్తున్న వాచ్ టవర్‌ను పరిశీలించారు. కృష్ణానదీ తీర ప్రాంతాల్లో చేపట్టనున్న టూరిజం అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఏకో టూరిజం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కృష్ణానది పరివాహక ప్రాంతాలు, నల్లమల అందాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ సునీల్ హిరేమత్, ఎఫ్‌డీవో ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ అధికారి రామ్మోహన్, డివిజనల్ అధికారి చంద్రశేఖర్, కొల్లాపూర్ రేంజర్ ఈశ్వర్, అటవీ రేంజర్ దేవరాజు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నార

దేవాలయాలే టార్గెట్

» విగ్రహాల వెండి తొడుగుల చోరీ

» నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

» రూ. 3.96 లక్షలు, రెండు బైకుల స్వాధీనం

» వెల్లడించిన మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి



దేవాలయాల్లో ఆభరణాలను దొంగిలించే దొంగను ప్రవేశపెట్టి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ జానకి

భూత్పూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : దేవాలయాల్లో విగ్రహాల వెండి తొడుగులు, ఆభరణాలను చోరీ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి తెలిపారు. కేసు వివరాలను భూత్పూర్ సీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన తోక కర్నాకర్ అనే వ్యక్తి గత జూలై 31న చిన్నచింతకుంట గ్రామంలోని గంగాభవానీ దేవాలయం తాళాలు విరగ్గొట్టి లోనికి ప్రవేశించాడు. అమ్మవారి విగ్రహంపై ఉన్న ఒకటిన్నర కిలోల వెండి తొడుగును ఎత్తుకెళ్లాడు. అదే రోజు మద్దూరు గ్రామంలోని దేవాలయంలో వెండి ఆభరణాలను చోరీ చేశాడు. సంఘటనపై దేవాలయ కమిటీ సభ్యుడు కృష్ణయ్య ఫిర్యాదు చేయడంతో, పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు. అయితే నిందితుడు తోక కర్నాకర్ మంగళవారం అమ్మాపూర్ స్టేజీ వద్ద అనుమానస్పదంగా తిరుగుతుండగా చిన్నచింతకుంట ఎస్ఐ రాంలాల్, పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకొని విచారించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో అతడు చేసిన చోరీలకు సంబంధించిన వివరాలను రాబట్టారు. పెద్దమందడి మండలంలోని మణిగిల్ల, వెల్టూరు, మానవపాడు మండలంలోని అమరవాయి, ఇటిక్యాల మండలంలోని షాబాద్, సాతర్ల, పెబ్బేరు మండలంలోని శాఖాపూర్, కొత్తకోట మండలంలోని చెర్లపల్లి, మదనాపూర్ మండలంలోని అజ్జకోలు గ్రామాల్లోని ఆలయాల్లో అతడు చోరీలకు పాల్పడ్డాడు. ఆయా దేవాలయాల్లో దాదాపు 7 కిలోల వెండి తొడుగులు, ఆభరణాలను చోరీ చేసి విక్రయించినట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ తెలిపారు. రూ.3,96,200, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లుగా చెప్పారు. కేసును త్వరిగతిన ఛేదించిన ఎస్ఐ రాంలాల్, పోలీసు కానిస్టేబుళ్లు నిరంజన్‌రెడ్డి, విష్ణు, బాల్‌రెడ్డి, రవిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, చిన్నచింతకుంట ఎస్ఐ రాంలాల్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

» డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

» లబ్ధిదారులకు కర్షకమిత్ర రుణాల పంపిణీ



రైతు వేణుగోపాలునాయుడుకు కర్షకమిత్ర రుణం చెక్కును అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

ఎర్రవల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాలు రైతుల సంక్షేమానికి కృషి చేస్తాయని, ఇవి వారి బ్యాంకులని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కర్షకమిత్ర పథకం ద్వారా 11 మంది రైతులకు మంజూరైన రూ.1.12 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో రుణాలను తిరిగి చెల్లించి, డీసీసీబీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పంటలకు క్రిమిసంహారక మందులను పిచికారి చేసే డ్రోన్ కొనుగోలుకు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ కోఆపరేటివ్ అధికారి గోళి శ్రీనివాసులు, సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు నరసింహులు, కృష్ణారెడ్డి, సిబ్బంది, పాల్గొన్నారు.

గద్వాల యువతికి ప్రతిష్టాత్మక పురస్కారం



అమెరికాలోని మిట్టి ల్యాబ్స్ లిమిటెడ్‌లో విధి నిర్వహణలో గద్వాల యువతి డాక్టర్ కొంకతి ప్రీతి

» నాయక్ రస్తోగి అవార్డుకు ఎంపికైన కొంకతి ప్రీతి

» ఉత్తర్వులు జారీ చేసిన ఐఐటీ బాంబే డైరెక్టర్ శిరీష్ కేదారే

గద్వాల సర్కిల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన యువతి ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. దివంగత జరీ చీరల వ్యాపారి కొంకతి సుదర్శన్ కుమార్తె డాక్టర్ కొంకతి ప్రీతి 'జియో ఇన్ఫార్మాటిక్స్ ఫర్ నేచురల్ రీసోర్సెస్ ఇంజనీరింగ్' అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ రంగ పరిశోధనల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఐఐటీ బాంబే వారు ఇచ్చే ప్రతిష్టాత్మక నాయక్ రస్తోగి పురస్కారానికి ఎంపికయ్యింది. ఈ మేరకు ఐఐటీ బాంబే డైరెక్టర్ శిరీష్ కేదారే ఉత్తర్వులు జారీ చేసినట్టు ప్రీతి కుటుంబ సభ్యులు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ పురస్కారం తమ కుమార్తెకు దక్కడం చాలా గర్వంగా ఉందని ఆమె తల్లి మాధవి సంతోషం వ్యక్తం చేశారు. ఐఐటీ బాంబేలో ఈ నెల 24న నిర్వహించనున్న కాన్వకేషన్ వేడుకల్లో ప్రీతికి పురస్కారం ప్రదానం చేయనున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆమె అమెరికాలోని మిట్టి ల్యాబ్స్ లిమిటెడ్‌లో రిమోట్ సెన్సింగ్ లీడ్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్నందున కాన్వకేషన్‌కు హాజరు కాలేకపోతున్నదని చెప్పారు. అమెరికా నుంచే వర్చువల్‌గా పురస్కారాన్ని స్వీకరించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఐఐటీ డైరెక్టర్ శిరీష్ కేదారే, విభాగాధిపతి, ప్రొఫెసర్ సూర్య దుర్భాలకు ప్రీతి, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

అక్క కోసం వెళ్తే ప్రాణం పోయింది


రేవంత్ (ఫైల్)

అలంపూరుచౌరస్తా/వడ్డేపల్లి/ఇటిక్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : బస్సుకింద పడి బాలుడు మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం, శనగపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. శనగపల్లె గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్ కృష్ణవేణిలకు కూతరు కనిష్క (6), కుమారుడు రేవంత్ (5) ఇద్దరు సంతానం. వీరు శాంతినగర్ పట్టణంలోని సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్‌లో అక్క ఎల్‌కేజీ, తమ్ముడు రేవంత్ నర్సరీ చదువుతున్నారు. వీరు రోజు పాఠశాల బస్సులో పోయి వస్తుంటారు. మంగళవారం కనిష్క ఒక్కతే స్కూల్‌కు వెళ్లింది. మంగళవారం సాయంత్రం పాఠశాల బస్సు రాగానే ఇంటివద్ద ఉన్న రేవంత్ అవ్వ మాణిక్యమ్మతో కలిసి అక్కను తీసుకురావడానికి వెళ్లాడు. మాణిక్యమ్మ కనిష్కను చేయి పట్టుకుని వెనక్కు తిరిగి చూస్తే రేవంత్ కనిపించలేదు. క్షణాల్లో పిల్లాడి రోదన వినిపించింది. తిరిగి చూస్తే బస్సు టైరు కిందపడి నలిగిపోయాడు. వెంటనే కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కానీ కాసేపటికే మృతి చెందాడని అక్కడి వైద్యులు తెలపడంతో తల్లిదండ్రుల రోదనలతో మిన్నంటాయి. బంధువులు, గ్రామస్థులు శాంతినగర్ పట్టణం చేరుకున్నారు. బాలుడి మృతదేహంతో అంతరాష్ట్ర రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. క్లీనర్ లేకుండా బస్సును పంపిన యాజమాన్యంపై, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన డ్రైవర్ సునీల్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాలుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని శాంతినగర్ ఎస్సై నాగశేఖర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని గద్వాల ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గొర్రెలకాపరి మృతి

పెద్దమందడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాగమోని మేపు మల్లయ్య (40) ప్రతీరోజులాగే గొర్రెలను మేపుకోవడానికి అదే గ్రామానికి చెందిన పల్లె రాములు పొలం దగ్గరికి వెళ్లాడు. పొలంలోని వ్యవసాయ బోరుబావి కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు వేలాడుతున్న విషయం గమనించలేదు. గొర్రెల వెంట వెళ్లి విద్యుత్ వైరు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

» 1.6 కిలోల గంజాయి, 3 ఫోన్లు స్వాధీనం

» గద్వాల డీఎస్పీ మొగులయ్య

గద్వాల క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి గంజాయిని తెచ్చి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసినట్లు డీఎస్పీ మొగులయ్య తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి తీసుకొచ్చి, విక్రయిస్తున్న పట్టణ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వారు మంగళవారం ఉదయం రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో గద్వాలకు చెందిన బాషామియ్యా, అయిజకు చెందిన పూర్ణ అంబదాస్, చాకలి పరశురాముడు ఉన్నారు. వారి నుంచి 1.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించారు. వారు ముగ్గురు 6 నెలలుగా మహారాష్ట్ర షోలాపూర్‌లో గంజాయి కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. చిన్న ప్యాకెట్లుగా చేసి, అయిజ, గద్వాల పట్టణాల్లో యువకులకు అమ్ముతున్నారు. ఇలా వారు ఇప్పటివరకు 30 మంది యువకులకు గంజాయి విక్రయినట్లు పోలీసు విచారణలో వెల్లడయ్యింది. విలేకరుల సమావేశంలో సీఐ టంగుటూరి శ్రీను, పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

మక్తల్‌లో మరో ముగ్గురు...

మక్తల్ (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణ సమీపంలోని ఓ వెంచర్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. మక్తల్ మండలంలోని కర్ని గ్రామానికి చెందిన భానుప్రసాద్, నాగర్‌కర్నూల్ జిల్లా, దేశిటిక్యాల గ్రామానికి చెందిన నీరిడి సాయిరాం, మంథని సాయికుమార్‌లు గంజాయి విక్రయిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం అందడంతో ఈ నెల 18న మక్తల్ పట్టణంలోని నారాయణపేటరోడ్‌లోని ఓ వెంచర్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 150 గ్రాముల గంజాయి, రూ.5వేలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు. దాడుల్లో పోలీసులు మనోహర్‌రెడ్డి, శ్రీను, నరేశ్, శశిధర్ పాల్గొన్నారు.

పట్టుబడిన బైకు దొంగ

జడ్చర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల బస్టాండ్ క్యాంటీన్‌లో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లేందుకు యత్నిస్తున్న వ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల కొత్తబస్టాండులో మంగళవారం ఈ సంఘటన జరిగింది. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి క్యాంటీన్ ముందు ద్విచక్రవాహనాన్ని నిలిపి వెళ్లిపోయాడు. అదే సందర్భంలో ఓ వ్యక్తి ఎవరూ చూడటం లేదని భావించి, ఆ వాహనాన్ని ఎత్తుకెళ్లేందుకు యత్నించాడు. ఆర్టీసీ సెక్యూరిటీ ఉద్యోగి లింగంపేట నర్సింహులు అతడిని గమనించి పట్టుకున్నాడు. ఆ తర్వాత జడ్చర్ల పోలీస్‌స్టేషన్లో అప్పగించాడు.

వృద్ధురాలి అదృశ్యం

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని పోతన్‌పల్లి గ్రామానికి చెందిన గొల్ల చంద్రమ్మ(65) పది రోజుల క్రితం అదృశ్యమయ్యింది. చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆమె కోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉండవల్లి మండలంలో యువతి...

అలంపూరు చౌరస్తా (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యం అయ్యింది. ఆ యువతి నెల రోజుల క్రితం మరో గ్రామంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. ఈ నెల 9న రాత్రి నుంచి ఆమె కనిపించకుండా పోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు బంధువులను, స్నేహితుల ఇళ్లల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె సోదరి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

వాహనం ఢీకొని 10 గొర్రెలు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు

మిడ్జిల్, ఆగస్టు 19 : (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని 10 గొర్రెలు చనిపోయాయి. మిడ్జిల్ ఎస్ఐ శివ నాగేశ్వర్‌నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య, అతడి కుమారుడు శ్రీనివాసులు 150 గొర్రెలున్న తమ మందను మంగళవారం తెల్లవారు జామున కల్వకుర్తి - జడ్చర్ల ప్రధాన రహదారి మీదుగా తోలుకెళ్తున్నారు. అదే సమయంలో జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో 10 గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


జడ్చర్ల మండలంలో అలుగు వారుతున్న రంగనాయకుల చెరువు


నారాయణపేట జిల్లా మాగనూర్ మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న అడివిసత్యారం వాగు


నారాయణపేట జిల్లా కొత్తపల్లి -భూనేడ్ మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద పారుతున్న నీరు

ఏకధాటి వర్షం

» 48 గంటల నుంచి వదలని వాన

» ఉమ్మడి పాలమూరులో స్తంభించిన జనజీవనం

» పలు పాఠశాలలకు మధ్యాహ్నం నుంచి సెలవు

» అలుగు పారుతున్న వాగులు, వంకలు

» గ్రామీణ ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు

నారాయణపేట/అచ్చంపేట/ జడ్చర్ల/ నవాబ్‌పేట/ కోయిలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో వారం రోజులుగా ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. చెరువులు అలుగు పారుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

● నారాయణపేట జిల్లా మంగళవారం రోజంతా ముసురు వర్షం కురుస్తూనే ఉంది. మక్తల్ మండలంలోని సంగబండ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మాగనూర్ మండలంలోని అడవి సత్యారం బ్రిడ్జిపై వరద నీరు పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. బైరంపల్లి వద్దనున్న కల్వర్టుపై వరద ఉధృతి కొనసాగింది. కొత్తపల్లి - భూనేడ్ మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన వేసిన తాత్కాలిక మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. జిల్లా వ్యాప్తంగా 769 చెరువులు ఉండగా, 328 చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. 235 చెరువుల్లో 75 నుంచి 100 శాతం నీరు చేరుకున్నది. 152 చెరువుల్లో 50 నుంచి 75 శాతం నీరు చేరింది. 26 చెరువుల్లో 25 నుంచి 50 శాతం వరకు నీరు వచ్చింది. 28 చెరువులలో 25 శాతం లోపు నీరుచేపేరింది. 42.7 శాతం చెరువులు అలుగులు పారుతున్నాయి. 30.6 శాతం చెరువులు నిండేందుకు దగ్గరలో ఉన్నాయి.

● నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండల కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న అక్కారం బక్కలింగాయపల్లి, గణపూర్ అంజనేయతండా పంచాయతీలకు రాకపోకలు నిలిచిపోయాయి. నక్కలగండి ప్రాజెక్టులోకి దుందుభీ వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే రహదారిపై 10 అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు ఆగిపోయాయి. అత్యవసరం అయితే పుట్టీల్లో అవతలి ఒడ్డుకు చేరుకోవాల్సి ఉంటుంది.


నారాయణపేట జిల్లా, ఊట్కూరులో అలుగు పారుతున్న చెరువు

● మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల నియోజకవర్గంలో చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సమీపంలోని రంగనాయకులచెరువు, లింగంపేట సమీపంలోని గంజివాగు, నసరుల్లాబాద్ చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. దుందుభీ నదికి వరద ఉధృతి కొనసాగుతోంది. కొండేడు, లింగంపేట, నెక్కొండ, కుర్వగడ్డపల్లి, ఆల్వాన్‌పల్లి, గుట్టకాడిపల్లి చెక్‌డ్యాంలు నిండి పారుతున్నాయి. పోలేపల్లి - కిష్టారం, చెర్లపల్లి - నసరుల్లాబాద్, జడ్చర్ల - లింగంపేట గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. నవాబ్‌పేట మండలంలో దుందుభీ నది పరిధిలోని కారూర్ వాగుకు వరద పోటెత్తడంతో గ్రామసమీపంలోని చెక్‌డ్యాం కూలిపోయింది. కోయిలకొండ మండల కేంద్రం సమీపంలోని పెద్ద చెరువు అలుగు వారుతోంది. నవాబ్‌పేట మండలంలోని చౌడూర్ గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువు కట్టకు గండిపడింది. ఇది గమనించిన గ్రామస్థులు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనె మరమ్మత్తులు చేయాలని అధికారులను కోరారు.

వరదలో కొట్టుకుపోయిన బైక్

బిజినేపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రహదారిపై ఉధృతంగా పారుతున్న వరద నీటిలో ఓ బైక్ కొట్టుకు పోయింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో మంగళవారం ఉదయం ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై బిజినేపల్లి నుంచి నందివడ్డెమాన్‌కు బయలు దేరారు. గ్రామ సమీపంలో రహదారిపై భీమసముద్రం చెరువు నీరు ఉధృతంగా పారుతోంది. పోలీసులు, స్థానికులు వద్దని వారిస్తున్నా వినకుండా రోడ్డు దాటేందుకు యత్నించడంతో బైక్‌తో సహా కొట్టుకుపోయారు. స్థానికులు స్పందించి వారిని కాపాడి, బైక్‌ను బయటకు లాక్కొచ్చారు.


నంది వడ్డెమాన్ వద్ద వరద నీటిలో ద్విచక్రవాహనంపై రోడ్డు దాటేందుకు యత్నిస్తూ కిందపడిన యువకులు

ఘాట్ రోడ్‌లో విరిగి పడిన బండరాళ్ల తొలగింపు

బ్రహ్మగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, శ్రీశైలం ఘాట్‌రోడ్‌లో సోమవారం కొండ చెరియలు విరిగి పడ్డాయి. పెద్ద బండ రాళ్లు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బంది ఏర్పడింది. దీంతో మంగళవారం బ్రహ్మగిరి ఎస్ఐలు జయన్న, శ్రీనువాసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో బండరాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రానికి వచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బ్రహ్మగిరి నుంచి పాతాళగంగ వరకు ఉన్న ఘాట్‌రోడ్‌లో రక్షణ గోడలు చాలా వరకు కూలిపోయాయి. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.


శ్రీశైలం డ్యాం సమీపంలో రహదారిపై పడిన కొండ రాళ్లను తొలగిస్తున్న పోలీసులు


అచ్చంపేట మండలంలోని అక్కారం రహదారిపై రాకపోకలను నిలిపివేస్తూ అడ్డుగా వేసిన కంచె


నవాబ్‌పేట మండలంలోని కారూరు వద్ద కూలిపోయిన చెక్‌డ్యాం


అలుగు పారుతున్న కోయిలకొండ పెద్ద చెరువు

రెండు రోజులుగా వదలని ముసురు

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూలు/గద్వాల/వనపర్తి, ఆగస్టు 19 (ఆంధజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానలు జోరుగా కురుస్తున్నాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వానలకు జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వర్షం ఆగకుండా కురుస్తూనే ఉన్నది.

● నాగర్‌కర్నూలు జిల్లా కోడేరులో 25.4 మిల్లీమీటర్ల వర్షం కురువగా లింగాలలో 22.2, పెద్దకొత్తపల్లిలో 15.8, అచ్చంపేటలో 11.0, బిజినేపల్లిలో 10.6, మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

● మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో అత్యధికంగా 36 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ రూరల్‌లో 24, అడ్డాకల్‌లో 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మహ్మదాబాద్‌లో 31, జడ్చర్లలో 18, హన్వాడలో 22 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

● జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 17 మి.మీటర్లు, మల్దకల్‌లో 15, కేటీదొడ్డిలో 12.4, గట్టులో 12.2, అలంపూర్‌లో 10.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

● వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో 18.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెబ్బేరు 16.4, శ్రీరంగాపూర్ 14.6, వనపర్తి 13.2, ఆత్మకూరు 12.4, మదనాపూర్ 11.2, పెద్దమందడి 10.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

● నారాయణపేట దామరగిద్ద మండలంలో 15.8 మి.మీ., ఊట్కూర్‌లో 14.5, నారాయణపేట మండలంలో 12.0, మాగనూర్ మండలంలో 10.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

నిండిన ప్రాజెక్టులు

» కోయిల్‌సాగర్ 2 గేట్లు ఎత్తివేత » 'సుంకేసుల'కు పోటెత్తిన వరద


కోయిల్‌సాగర్ 2 గేట్లు ఎత్తడంతో విడుదలవుతున్న నీరు

దేవరకద్ర/ మక్తల్ రూరల్/ రాజోలి/ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులు నిండు నీటితో కళకళలాడుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 32 అడుగులకు చేరింది. మొత్తం 13 గేట్లలో సోమవారం ఐదు గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. పై నుంచి వరద తగ్గడంతో మంగళవారం మూడు గేట్లను మూసి వేసి, 2 గేట్ల ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ప్రతాప్ సింగ్ తెలిపారు. నీటి పరవళ్లను తిలకించేందుకు సందర్శకులు అధికసంఖ్యలో తరలివచ్చారు. యువకులు గాలాలతో చేపలు పడుతూ సందడి చేశారు.

'సంగంబండ' 2 గేట్ల నుంచి నీటి విడుదల

నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం 2 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద ఉధృతి తగ్గడంతో అధికారులు మంగళవారం ఉదయం 5 గేట్లను మూసి వేశారు. మరో 2 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి 1000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1000 క్యూసెక్కుల ఔట్ ఫ్లో కొనసాగుతోంది. రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.60 టీఎంసీలనీరు నిల్వ ఉందని డీఈ సురేశ్ తెలిపారు.

'సుంకేసుల'కు 1.40లక్షల ఇన్‌ఫ్లో

జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రం శివారులోని సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి 1.40 లక్షల కూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో 9 గేట్లు మీటరు, 11 గేట్లు 2 మీటర్ల మేర ఎత్తి 1.38 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 290.20 మీటర్లుగా నమోదయ్యింది. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలకు, ప్రస్తుతం 0.608 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కర్నూలు కేసీ కెనాల్‌కు 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ మద్దిలేది తెలిపారు.

కూలుతున్న పాత ఇళ్లు


జడ్చర్ల మునిసిపాలిటీలోని శంకరాయపల్లితండాలో కూలిన ఇల్లు


జడ్చర్ల మునిసిపాలిటీలోని బాబీస్ట్రీట్‌లో కూలిన ఇల్లు

నారాయణపేట/ మాగనూరు/ హన్వాడ/ జడ్చర్ల/ నవాబ్‌పేట/ రాజోలి/ చారకొండ, , ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగు విడవకుండా పడుతున్న వానలతో పాత మట్టి మిద్దెలు, ఇళ్లు తడిసి కూలిపోతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని బాబీస్ట్రీట్‌లోని ఓ ఇంటి ముందు భాగం మంగళవారం తెల్లవారుజామున కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. 9వ వార్డు పరిధిలోని శంకరాయపల్లితండాలో హన్మంతుకు చెందిన ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ చైతన్యచౌహాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్‌నాయక్, కిషన్, కృష్ణారావు, వార్డు ఆఫీసర్ జగన్ ఇంటిని పరిశీలించారు. నవాబ్‌పేట మండలంలోని రుద్రారం గ్రామంలో కుర్వ నరేశ్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలిపోయింది. నారాయణపేట జిల్లాలో ఇప్పటి వరకు 97 ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. ఊట్కూర్ మండలంలో 30 ఇళ్లు, కొత్తపల్లి మండలంలో ఒక ఇల్లు పాక్షి కంగా కూలాయి. .

దన్వాడ మండలంలో 19, దామరగిద్ద మండలంలో 2, కోస్గి మండలం లో 6, కృష్ణ మండలంలో 3 ఇండ్లు కూలిపో యాయి. మాగనూర్ మండలంలో 12, మక్తల్ మండలంలో 5, మరికల్ మండలంలో 12, నర్వ మండలంలో 7 ఇళ్లు పాక్షికంగా కూలాయి. హన్వాడ మండలంలో మంగళవారం 5 ఇళ్లు కూలిపోయాయి. టంకరలో 2, దాచకపల్లిలో 1, యారోనిపల్లిలో 1, మాదారంలో మరో ఇల్లు కూలిపోయింది. దాచకపల్లిలో కూలిన ఇంటిని బీజేపీ నాయకులు పరిశీలించారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని తుమ్మిళ్ల గ్రామంలో సుంకమ్మకు చెందిన మట్టిమిద్దె కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పచ్చర్లలోనూ ఓ ఇంటి పైకప్పు కూలిపోయింది.


పచ్చర్ల గ్రామంలో కూలిన మట్టిమిద్దె


హన్వాడ మండలంలోని దాచకపల్లిలో కూలిపోయిన ఇల్లు

కూలిన మట్టి ఇల్లు

నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని జూపల్లిలో జంతుక రాములుకు చెందిన ఇంటి పైకప్పు కూలిపోయింది. మండల కేంద్రంలో రెండు ఇళ్లు శిథిలావస్థలో ఉండటంతో ఆ కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చారకొండ తహసీల్దార్ అద్దంకి సునిత తెలిపారు.

న్యూస్ బాక్స్

లీకేజీని అరికట్టాలి

హన్వాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దదర్పల్లిలో ఇంటింటికీ వెళ్లే మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీని మరమ్మతు చేసి బాగు చేయాలని బీజేపీ మండల నాయకుడు రఘురాంగౌడ్ అధికారులను కోరారు. మంగళవారం లీకేజీని పరిశీలించి, కలుషిత నీరు వచ్చే ప్రమాదముందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మూసాపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం కాటవరం లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మంగళవారం చేవెళ్ల ఏసీపీ కిషన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన్‌గౌడ్, నాయకులు బనదీశ్వర్, కొండన్న, రాజు నాయక్, కృష్ణయ్య పాల్గొన్నారు.

నేడు టీఎల్ఎం మేళా

మూసాపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం టీచింగ్ లెర్నింగ్ మెటీరీయల్ (టీఎల్ఎం) మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈవో కురుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో ప్రవీణ్‌కుమార్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, సీఎంవో బాలుయాదవ్ హాజరువుతారని తెలిపారు.

మెరుగైన విద్యను అందించాలి

దేవరకద్ర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యనందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని డీఈవో ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని డోకూర్ సమీపంలో ఉన్న కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం భోజనం గదిని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

పాఠశాలలకు సెలవులు ప్రకటించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల విద్యార్థులు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారని, వెంటనే జిల్లాలోని పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని మంగళవారం డీఈవో ప్రవీణ్‌కుమార్‌కు పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, భూపతిసింగ్ వినతిపత్రం అందజేశారు.

'పాత ఇళ్లలో ఉండొద్దు'

గండీడ్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పాత ఇళ్లల్లో ఎవ్వరూ ఉండరాదని ప్రత్యేకాధికారి తహసీల్దార్ మల్లిఖార్జున్‌రావు అన్నారు. మంగళవారం పంచలింగాల తండాలో పర్యటించి, గ్రామ సభలో మాట్లాడారు. అనంతరం పగిడ్యాల్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. అంతకుముందు మండలంలోని అలుగు పారుతున్న కొంరెడ్డిపల్లి కొత్త కుంటను పరిశీలించారు.

ఆశా వర్కర్లకు జూలై వేతనం చెల్లించాలి

పాలమూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆశావర్కర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించడంతో పాటు ఆశాలకు జూలై వేతనం తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి బి.చంద్రకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల ఎదుట ఆశాల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టామన్నారు. పట్టణంలో ఎంసీహెచ్ రామయ్యబౌలి, పీపీ యూనిట్, పాత పాలమూరు, మోతీనగర్‌లో నిరసనలు తెలిపారు. ఆశావర్కలు యాదమ్మ, పద్మ, సునీత, భువనేశ్వరి, సౌజన్య, చంద్రరేఖ, భాగ్య, మంజుల, మహాలక్ష్మి, నిర్మల, జ్యోతి పాల్గొన్నారు.

ప్రతీ సమస్యకు పరిష్కారం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మనిషి జీవితంలో ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు పరిష్కారం ఉం టుందని, అనవసరంగా ఆందోళనకు గురై జీవితాలు నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె న్యాయ సలహాలు అందించారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

మహమ్మదాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల, ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసే వరకు పీఆర్టీయూ టీఎస్ పోరాటం చేస్తోందని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బీజం భీంరెడ్డి అన్నారు. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నా పోస్టర్‌ను మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించి, మాట్లాడారు. మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర అసోయేట్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, రమీందర్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం పాండురంగారెడ్డి, బాలికల పాఠశాల హెచ్‌ఎం నీలకంఠప్ప, రాష్ట్ర కార్యదర్శులు రాము, పాండు, జిల్లా మహిళ అసోసియేట్ అధ్యక్షురాలు గీత, కార్యదర్శి హన్మంతు, విష్ణుగౌడ్ పాల్గొన్నారు.

యూరియా కొరత రానివ్వొద్దు

నవాబ్‌పేట/కోయిలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యూరియా కొరత రానివ్వకుండా వ్యాపారులు ఉన్న నిల్వలను ఎప్పటికప్పుడు రైతులకు విక్రయించాలని నవాబ్‌పేట, కోయికొండ ఎస్‌ఐలు విక్రం, తిరుప్పాజీ అన్నారు. మంగళవారం నవాబ్‌పేట మండల కేంద్రంలోని ఓ వ్యాపారి గోడౌన్‌ను సందర్శించి యూరియా నిల్వలను పరిశీలించారు. కోయిలకొండలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో యామారెడ్డితో కలిసి ఎస్‌ఐ తనిఖీ చేశారు.

మండపాలకు ఆన్‌లైన్ తప్పనిసరి

» గణేశ్ ఉత్సవాలపై పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టి

» జిల్లాలో దాదాపు 2 వేల విగ్రహాల ఏర్పాటు

» చెరువుల వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న పోలీసులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి..



గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి. పోలీస్ శాఖ పూర్తి బందోబస్తు నిర్వహిస్తుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే రూమర్స్, అసత్య ప్రచారాలను నమ్మవద్దు. ఇప్పటికే జిల్లాలోని పలు చెరువులను పరిశీలించాం. మద్యం సేవించి నిమజ్జనంలో పాల్గొనవద్దని, చిన్నారులను చెరువుల వద్దకు అనుమతించకూడదని పోలీసులకు సూచించారు.

- జానకి, ఎస్పీ

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాలు వారం రోజుల్లో ప్రారంభం కానుండటంతో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు అలుగులు పారుతుండగా, చెరువుల వద్ద పరిస్థితిని గమనిస్తూనే బందోబస్తుపై దృష్టి సారిస్తున్నారు. నిర్వాహకులు పెద్ద ఎత్తున మండపాలు ఏర్పాటు చేయనుండగా, విగ్రహ నిర్వాహకులు కూడా భారీ ఆకారం గల గణపతుల తయారికి ప్రాధాన్యం ఇవ్వడంతో మండపాలకు తప్పనిసరిగా పోలీస్ అనుమతి ఉండాలని స్పష్టం చేస్తోంది. అది కూడా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీంతో విగ్రహాల సంఖ్య, వాటి ఎత్తు, ఎన్ని రోజులకు నిమజ్జనం చేస్తారనే వివరాలు అందులో ఉంటాయి. తద్వారా తీసుకోవాల్సిన చర్యలకు మార్గం సులువుకానుంది. జిల్లా కేంద్రంలోనే 1000 వరకు మండపాలు వెలియనున్నాయి. జడ్చర్ల, దేవరకద్ర, భూత్పూర్ మండపాలతో పాటు గ్రామాల్లో కలిపితే మరో 1000 మండపాలు వెలియనున్నాయి.

పోలీస్ శాఖ నిబంధనలు..

గణేశ్ మండపాల వద్ద పూర్తి బాధ్యత నిర్వాహకులదే. ప్రతీ మండపం దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తిచేయాలి. మండపాలు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండప ఏర్పాటుకు సంబంధిత శాఖల అనుమతి తీసుకోవాలి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల తరువాత స్పీకర్లు వినియోగించరాదు. శోభాయాత్రలో డీజే వినియోగించరాదు. మండపాలలో 24 గంటలు ఒక వలంటీర్ ఉండాలి. ప్రతీ మండపం వద్ద పాయింట్ పుస్తకం ఏర్పాటు చేయాలి. పోలీసులు తనిఖీల సమయంలో అందులో సంతకాలు చేస్తారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

» కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ జానకి



ఫొటో గ్రాఫర్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ న్యూటౌన్/రాజాపూర్/నవాబ్‌పేట/చిన్నచింతకుంట/కోయిలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఎస్పీ జానకి తన కార్యాలయంలో కేక్ కట్ చేసి ఫొటో గ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఫొటోగ్రఫీ అనేది కేవలం ఒక కళ మాత్రమే కాదని, ఒక మధురమైన క్షణాన్ని శాశ్వతంగా నిలిపివేసే అద్భుతమైన సాధనం అన్నారు. ఫొటోగ్రఫీ గౌరంగా భావిస్తూ సృజనాత్మకంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించాలని సూచించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఫొటో గ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. రాజాపూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి మండల ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నవాబ్‌పేట మండలంలో ఆ సంఘం నాయకుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో డాగురే చిత్ర పటానికి నివాళి అర్పించి, పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. చిన్నచింతకుంటలో తహసీల్దార్ ఎల్లయ్య ముఖ్య అతిథిగా పాల్గొని లూయిస్ డాగుడే చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కోయిలకొండ మండల కేంద్రంలో ఫొటో గ్రాఫర్‌ల సంఘం ఆధ్వర్యంలో డాగురే చిత్రపటానికి నివాళి అర్పించారు.

ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు



జడ్చర్లలో బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

జడ్చర్ల/మిడ్జిల్ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో మంగళవారం పోచమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. బాదేపల్లి పాతబజారులోని పోచమ్మ ఆలయం, జడ్చర్లలోని పోచమ్మ ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఓ వైపు ముసురు వర్షం కురుస్తున్నా బోనాలను నెత్తిన పెట్టుకుని మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ వేర్వేరుగా పాల్గొని బాదేపల్లి పాతబజారు, జడ్చర్ల, బురెడ్డిపల్లిలోని పోచమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. మిడ్జిల్ మండల కేంద్రంతో పాటు వెలుగొమ్ముల గ్రామంలో బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ నోడల్ అధికారి (ఐఏఎస్) దివ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు మాట్లాడుతూ 17 సంవత్సరాల క్రితం 104 అంబులెన్స్‌లలో తమను ఉద్యోగంలోకి తీసుకున్నారని, 2022లో ఆ అంబులెన్సులను రద్దు చేయడంతో అప్పటి నుంచి వైద్య ఆరోగ్యశాఖలోని ఆయా విభాగాల్లో పనిచేయించుకుంటున్నారని తెలిపారు. అయితే 4 నెలలుగా వేతనాలు కూడా ఇవ్వడం లేదని, తమ ఉద్యోగాలను కొనసాగిస్తూ ప్రతీ ఏడాది ఉత్తర్వులు వచ్చేవని, ఈ ఏడాది ఇప్పటి వరకు ఆర్డర్ రాలేదని, అందులో కూడా కొంత మందికే వచ్చాయన్నారు. తమను 300 డీసీఎస్ కిందికి తీసుకోవాలని, ఉద్యోగులందరికి కొనసాగింపు ఆర్డర్లు ఇవ్వాలని కోరారు.

శ్రీవారి సేవకు 18 ఏళ్ల నిరీక్షణ

» కోర్టు కేసుతో దర్శనం కల్పించిన టీటీడీ అధికారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన శెట్టి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో తిరుమల తిరుపతి దర్శనం కోసం 2007లో డీడీ తీశారు. ఆయన తీసిన డీడీ ప్రకారం తిరుమల తిరుపతి దేవస్థానం వారు 2020లో శ్రీవారి దర్శనం కల్పించాల్సి ఉంది. 2020లో కరోనా కారణం చేత టీటీడీ వారు శెట్టి చంద్రశేఖర్‌కు దర్శనం కల్పించలేదు. దీంతో తనకు తిరుమలలో శ్రీవారి దర్శనం కల్పించాలని ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తీర్పు భక్తుడి అనుకూలంగా రానున్నట్లు తెలుసుకున్న టీటీడీ అధికారులు మధ్య వర్తుల ద్వారా శెట్టి చంద్రశేఖర్‌తో రాయబారం నడిపి మీకు, మీ కుటుంబ సభ్యులకు దర్శనం కల్పిస్తాం, కేసును ఉపసంహరించుకోవాలని కోరారు. దీంతో ఎట్టకేలకు 18 సంవత్సరాల అనంతరం ఈనెల 14న ఆరుగురు కుటుంబ సభ్యులకు మెయిల్ చాట్ వస్త్రం సేవలో పాల్గొన్నారు. 15న ఉదయం శ్రీవారి గర్భగుడిలో గంటన్నర పాటు స్వామి సేవలో శెట్టి చంద్రశేఖర్, సుమిత్ర దంపతులు పాల్గొన్నారు.

మధుసూదన్ శర్మకు తెలుగు తేజం అవార్డు

కోయిలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరారం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జోషి మధుసూదన్‌శర్మ తెలుగు తేజం అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 31న ఆంధ్రప్రదేశ్‌లోని నరసారావుపేటలో నిర్వహించే తెలుగు భాషా సంబురాల కార్యక్రమంలో తెలుగు తేజం అవార్డును అందుకోనున్నారు.

భూత్పూర్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

భూత్పూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : భూత్పూర్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ జానకీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు ఏ విధంగా మెలుగుతున్నారనే విషయాన్ని ఫిర్యాదుదారుడిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని గోపన్నపల్లికి వెళ్లే దారికి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున గ్రామానికి వెళ్లే ప్రజలకు ఎలాంటి సహకారాలు అందిస్తున్నారని ఎస్‌ఐ చంద్రశేఖర్‌ను అడిగారు.

విద్యుత్ అనుమతి తప్పనిసరి

పాలమూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గణపతి మండపాలకు విద్యుత్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మహబూబ్‌నగర్ ఏడీఏ తౌర్యానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలు, కేబుల్ కింద గణపతి మండపాలు ఎవరు పెట్టుకోరాదన్నారు. మండపాలకు ఐఎస్ఐ మార్కు కలిగిన వైర్లనే వాడాలన్నారు. స్విచ్‌బోర్డు, ఎంసీబీ తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ నియంత్రికల వద్ద, హైటెన్షన్, ఎల్‌టీ లైన్ల కింద విగ్రహాలు పెట్టరాదన్నారు. వివరాలకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బందిని కలవాలన్నారు.

రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా జరుపుకుందాం

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం కాంగ్రెస్ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించాలని కాంగ్రెస్ మీడియా సెల్ ఇన్‌చార్జి సీజే బెనహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి వేడుకలు నిర్వహిస్తామని, 11 గంటలకు పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తారని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధర్నాను విజయవంతం చేద్దాం

భూత్పూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు అమలు చేస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ.. సెప్టెంబరు 1వ తేదీన చేపట్టే ధర్నా పోస్టర్లను ఉపాధ్యాయ సంఘం నాయకులు మంగళవారం విడుదల చేశారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన టీఎల్ఎం ప్రదర్శన కార్యక్రమంలో భోజన విరామ సమయంలో పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. సీఎంవో బాలు యాదవ్, ఉపాధ్యాయ సంఘం నాయకులు సురేష్‌రెడ్డి, బాలరాజుగౌడ్, సాయిరాంగౌడ్, సురేందర్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

డాక్టర్లపై దాడులతో అభద్రతాభావం



మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రైవేటు డాక్టర్లపై జరుగుతున్న దాడుల కారణంగా డాక్టర్లలో అభద్రతాభావం నెలకొందని జిల్లా థింకర్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో పట్టణ వైద్యులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయనతో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. ఇటీవల యునైటెడ్ ఆసుపత్రిలో రోగి తరపు బంధువులు ఆసుపత్రిపై దాడి చేసిన క్రమంలో మాట్లాడటానికి వెళ్లిన ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంమోహన్‌పై కూడా జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇకపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా, డాక్టర్లు, ఆసుపత్రులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలి : యెన్నం

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా వాగులు వంపులు పొంగిపొర్లుతున్నాయని, చెరువులు అలుగులు పారుతున్నాయని, ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. జిల్లా కేంద్రానికి చెందిన కాంగ్రెస్ డివిజన్ నాయకులు, హన్వాడ, రూరల్ మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారిని అప్రమత్తం చేస్తుండాలన్నారు. పాత ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించి, వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.

కేజీవీబీలో వసతుల కల్పనకు కృషి



కేజీవీబీ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తున్నామని, రాబోయే రోజుల్లో నియోజకవర్గం విద్యాహబ్‌గా మారబోతుందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీవీబీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రస్తుత సీజన్‌లో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులతో విద్యార్థుల మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. కేజీవీబీలోని సమస్యలు, వసతి గృహాల పరిస్థితులు, తాగునీరు, మరుగుదొడ్లు, భోజనశాలతో తరగతిగదుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు త్వరలోనే సమకూర్చే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య, గౌస్, అబ్దుల్‌సమి, రమేష్‌నాయక్, జంగయ్య, విజయ్ కుమార్, జహీర్, పర్వతాలు పాల్గొన్నారు.

అనధికారికంగా తూములు తెరవొద్దు

జడ్చర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా అలుగెత్తిన చెరువులు, కుంటల తూములను అనధికారికంగా తెరిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇళ్లు, ప్లాట్లు, పొలాలు మునిగిపోతున్నాయనే నెపంతో తూములు తెరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో చిన్న, పెద్ద చెరువులు, కుంటలు నిండుకున్నాయని, పూర్తిగా నిండి అలుగు పారుతున్న సమయంలో అధికారికంగా తూములను అధికారులే తీస్తారని తెలిపారు. చెరువులు పూర్తిగా నిండకముందే, చెరువులోకి నీళ్లు వచ్చి చేరుతున్న దృష్ట్యా తమ ఇళ్లు మునిగిపోతున్నాయని కొందరు, అక్రమంగా ప్లాటింగ్ చేసిన వెంచర్‌లలోని ప్లాట్లు ముంపునకు గురవుతున్నాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు తూములు తెరిచే ప్రయత్నం చేయవద్దని హితువు పలికారు. గతంలో ఇలాంటి సంఘటనలు జరగడంతో ముందే హెచ్చరిస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

» పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహిళ సంఘాలను బలోపేతం చేసి మహిళలకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళలకు రెడిమెడ్ దుస్తుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాటాడారు. మహిళలకు జీవన ఉపాధి కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి మహిళా సంఘాలకు అనేక ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. మొదటి విడతగా మండలంలో 30 మంది మహిళలకు దుస్తుల తయారీలో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. అడిషనల్ డీఆర్డీవో శారద, డీపీఎం రాంమ్మూర్తి, ఎంపీడీవో కాళప్ప, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు చంద్రకళ, కార్యదర్శి సత్యమ్మ, కోశాధికారి మహేశ్వరి, ఏపీఎం వనజ, సీసీలు మల్లేష్, కేశవులు, బద్రు నాయక్, నరేష్, కృష్ణవేణి, కవిత పాల్గొన్నారు.

ప్రతీ నెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతీ నెల 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని తెలంగాణ మెడికల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జనరల్ ఆసుపత్రి బ్రాంచి అధ్యక్షుడు గోపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలోని ఏజెన్సీ కింద అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, సకాలంలో వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వేతనాలపై ఆధారపడి జీవిస్తున్న తాము సకాలంలో వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతీ నెల 1న వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ బ్రాంచి నాయకులు పాండు, మహ్మద్ ఖాదర్, మురళి, బుచ్చన్న, దేవానంద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ఫొటో అప్‌లోడింగ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మూసాపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం అడ్డాకుల మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన వివరాలు, వాటి నిర్మాణ దశలను పరిశీలించారు. మొత్తం 47 ఇళ్ల నిర్మాణాలకు, 27 బెస్‌మెంట్ లెవల్, ఒకటి లెంటల్ లెవల్‌లో ఉందని అధికారులు వివరించారు. అదే విధంగా ప్రధానమంత్రి అవాస్ యోజన ద్వారా ఉన్న ఇళ్ల సర్వే వివరాలను పరిశీలించారు. ఇళ్ల వివరాలకు సంబంధించి ఫొటోల క్రోడీకరణ చేసే అంశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం పనితీరు ప్రగతి నివేదికలపై పర్యవేక్షించారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వసతులు, సౌకర్యాలను పరిశీలించి, మరమ్మతులు ఉండే వాటిని చేయించి బిల్లులు పెట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో సద్గుణ, పంచాయతీ కార్యదర్శి సరస్వతి ఉన్నారు.

గణేశ్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు గణేశ్ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని వన్‌టౌన్ సీఐ అయ్యప్ప సూచించారు. మంగళవారం రాత్రి అల్మాస్ ఫంక్షన్‌హాల్‌లో గణేష్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు.ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. నిమజ్జన సమయంలో మద్యం తాగి డ్యాన్సులు, టపాసులు కాల్చరాదన్నారు. పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల కు చెందిన 100 మంది గణేశ్ మండపాల నిర్వహకులతో పాటు, వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలువురికి డాక్టరేట్

పాలమూరు యూనివర్సిటీ/ మహబూబ్‌నగర్ విద్యావిభాగం/హన్వాడ/చిన్నచింతకుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలోని రసాయశాస్త్ర విభాగం విద్యార్థి విజయలక్ష్మి పీయూ నుంచి డాక్టరేట్ పొందారు. మంగళవారం పీయూ పరీక్షల నిర్వహణ అధికారి ప్రవీణ ప్రకటించారు. పీయూ అసోసియెట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రకిరణ్ పర్యవేక్షణలో 'ఆక్వాయస్ ఫేస్ గ్రీన్ ట్రాన్స్ఫర్మేషన్స్ ఎంప్లాయింగ్ లూ యిస్ బేస్ అడక్ట్ ఆఫ్ ది మ్యాప్ అస్ న్యూ గ్రీన్ రీజెంట్స్ అండ్ స్టీరియో స్పెసిఫిక్ సిం తసిస్ ఆఫ్ మెడిసినల్లి యాక్టివ్ 1,8 నాఫ్తిరిడిన్ డెరివేటివ్స్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ఐఐసీటీ హైదరాబాద్ పర్యవేక్షణలో వైవా-వోస్ పూర్తిచేశారు. అందుకుగాను విజయలక్ష్మికి డాక్టరేట్ ప్రకటించారు.

- మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు చర్కా రాకేష్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటి నుంచి డాక్టరేట్ అందుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం నాగం రఘురాంరెడ్డి అభినందించారు.

- హన్వాడ మండలం లింగన్నపల్లికి చెందిన ఎల్లప్ప ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నాడు. మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం 84వ కాన్వకేషన్ కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు.

- చిన్నచింతకుంట మండలం బంద్రపల్లికి చెందిన జానకిరామ్ ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ నారాయణ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.